రెచ్చిపోతున్న ఇసుకాసురులు

అధికారం అండతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. స్వర్ణముఖి నదిని చెరబడుతున్నారు. జేసీబీలతో యథేచ్ఛగా తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డు వచ్చిన రెవెన్యూ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- స్వర్ణముఖి నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- జేసీబీతో ఇసుక తోడేస్తున్న వైనం
- అడ్డుపడిన వీఆర్‌ఏపై దురుసు ప్రవర్తన



స్వర్ణముఖినదిలో ఇసుకను తవ్వుతున్న జేసీబీ

చంద్రగిరి: స్వర్ణముఖినదిలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. ఇన్నాళ్లు రాత్రి వేళల్లో మాత్రమే ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఇసుక స్మగ్లర్లు ఇప్పుడు పట్టపగలే జేసీబీలతో ఇసుకను తోడేస్తున్నారు. గురువారం చంద్రగిరి బ్రహ్మంగారి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో జేసీబీతో ఇసుకను తవ్వి టిప్పర్ల ద్వారా తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి వీఆర్‌ఏను పంపించారు. స్వర్ణముఖి నదిలో జేసీబీతో ఇసుకను తోడేస్తుంటే అడ్డుకున్నారు. చంద్రగిరిలో అధికార పార్టీకి చెందిన ఓ యువనేత అనే చెప్పుకునే నాయకుడు అనుసూయడు ఘటన స్థలానికి చేరుకుని వీఆర్‌ఏపై దురుసుగా ప్రవర్తించాడు. ఓ క్రమంలో వీఆర్‌ఏపై దౌర్జన్యానికి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది జేసీబీని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఆయన కనుసన్నలోనే ఇసుక రవాణా

చంద్రగిరి పట్టణానికి చెందిన ఒక అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా బ్రహ్మంగారి ఆలయ సమీపంతో పాటు రెడ్డివారిపల్లి వాగు వద్ద కొంత మంది యువకులను పోగు చేసి నిరంతరం ఇసుకను తవ్వి తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత నాయకుడు తాను అధికార పార్టీ నేతనని, నియోజకవర్గ ప్రజాప్రతినిధి బంధువునంటూ అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే స్వర్ణముఖి నది తన సహజ స్వరూపాన్ని కోల్పోయిందని, ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో నీటి ఎద్దడి తప్పదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం


శివరామ సుబ్బయ్య తహసీల్దార్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శివరామ సుబ్బయ్య హెచ్చరించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని స్వర్ణముఖినది, భీమానది, పనపాకం, శేషాపురం, కందులవారిపల్లి, తొండవాడ, శానంబట్ల ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్టు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. రవాణాను నిలువరించేందుకు మండల వ్యాప్తంగా వీఆర్‌వోలు, విలేజ్ సెక్రటరీ, వీఆర్‌ఏలతో రాపిడ్ యాక్షన్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందంలో పోలీసులు కూడా ఉంటారని తెలిపారు. వారు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దాడులు చేసి, వాహనాలను సీజ్ చేస్తారని తెలిపారు. వాహనాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవన్నారు. , నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

క్లుప్తంగా

పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జి

పాకాల : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఈవో బాబ్జి తెలిపారు. ఆయన గురువారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న 100 రోజుల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి రెండవ శని, ఆదివారాల్లో అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఆ రోజుల్లో విద్యార్థులకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రేడ్‌ల వారిగా విభజించి చదువులో వెనుక బడిన వారి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిరోజూ స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జిలాని, హేమలత, నాగేంద్ర, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

3వ బ్యాచ్ ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం


టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

పాకాల : మండలంలోని దామలచెరువు మ్యాంగోనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌లో 3వ బ్యాచ్ ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభమైనట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.నాగూర్‌బాష తెలిపారు. డిస్టిక్ చైర్‌పర్సన్ గొడుగుచింత రామయ్య చేతుల మీదుగా గురువారం శిక్షణ ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటి వరకు 20 మంది మహిళలు శిక్షణ పొందేందుకు పేర్లను నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ మునరబి పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ల వితరణ



విద్యార్థులతో దాత, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాకాల : మండల కేంద్రమైన పాకాలలోని ఎన్‌వీఎన్ పాఠశాల విద్యార్థులకు గురువారం చిత్తూరుకు చెందిన విశ్రాంత రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్.భాస్కర్‌బాబు, బి.రమణి దంపతులు పెన్నులు, ప్యాడ్లు అందజేవారు. తమ కొడుకు సాయివిఘ్నేష్ తృతీయ వర్ధంతి సందర్భంగా సుమారు 310 మంది పిల్లలకు విద్యా సామగ్రి అందజేసినట్టు పేర్కొన్నారు. వారికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎ.బాబు, ఎస్.మునిరత్నం, దొరస్వామి, ఎస్‌ఎస్.సతీష్, పాఠశాల కమిటీ చైర్మన్ కుసుమకుమారి, హెచ్‌ఎం మోహన్ పాల్గొన్నారు.

సన్మానం


జయమ్మను సత్కరిస్తున్న ప్రజలు

పాకాల : మండలంలోని బైనపల్లి పంచాయతీలో సంఘమిత్రగా పనిచేసిన జయమ్మను గురువారం స్థానికులు ఘనంగా సత్కరించారు. వెలుగు ఏపీఎం రామ్మోహన్ సూచనల మేరకు వెలుగు సీసీ వెంకటముని ఆధ్వర్యంలో బైనపల్లి గ్రామంలో సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. జయమ్మ డ్వాక్రా సంఘాల బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు.

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కమిటీ ఎంపిక


ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: డాక్టర్ కె.నాగయ్య ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ భవన్ కేంద్రంగా బడుగు బలహీన వర్గాలకు సేవలందిస్తున్న ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పి.చెంగల్రాయులు, ప్రధాన కార్యదర్శిగా కె.భూపాల్, కోశాధికారిగా ఎం.ధనుంజయ, మరో 16 మందిఆఫీస్ బ్యారర్లుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్ పరిరక్షణ, ఎస్సీల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి కోసం పనిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

తాత్కాలిక ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింపజేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి సిటీ : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్, వర్క్ కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 16న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారు గురువారం ఎస్వీయూలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 2ను సవరించి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, ఎస్వీయూ వర్క్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి రాజేంద్ర, కార్యదర్శి మురగయ్య, కోశాధికారి సి గణేష్, మహిళా ఉద్యోగులు టి కళావతి, సెల్వి, సుజాత, ధరణి, సుమతి, పరిమళ, మీనా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర నూతన కమిటీ ఎంపిక


మల్లం రవిచంద్రారెడ్డి, తిరుపతి నగర ప్రెసిడెంట్

తిరుపతి అర్బన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం పలువురికి పార్టీ పదవులు కేటాయించింది. అందులో తిరుపతి నగర పార్టీ కమిటీ ప్రెసిడెంట్‌గా మల్లం రవిచంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మురళీకృష్ణ యాదవ్, రవీంద్రరెడ్డి, మోహన్‌రాజ్, తిరుపతి ఈస్ట్ అధ్యక్షుడిగా గణేష్‌కుమార్, తిరుపతి సౌత్‌కు పడమటి కుమార్, తిరుపతి వెస్ట్‌కు పంజాం అశోక్‌రెడ్డి, తిరుపతి నార్త్‌కు బ్రుంగి నవీన్‌లను నియమించింది. జనరల్ సెక్రటరీలుగా డేరంగుల బాలాజీ, సుశీలా యాదవ్, ధనశేఖర్, మోహన్‌కృష్ణ, తిమ్మారెడ్డి నియమితులయ్యారు. సెక్రటరీలుగా పాతపాళెం కుమార్, హరిప్రసాద్, రాజేంద్ర, భాస్కర్ రాయల్, పార్థసారథి, పుష్పలత, ఉషా, రామకృష్ణారెడ్డి, రాజ్ కుమార్‌రెడ్డి, జగదీష్ యాదవ్, రాజేంద్రరెడ్డి, కై లాస్ రెడ్డిని నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మునిరాజా, కార్తీక్, అంజూరా, రజనీకాంత్, మణికంఠ, ఢిల్లీబాబు, పురుషోత్తం, భాస్కర్‌రెడ్డి, పండు, శంకర్‌రెడ్డి, ఇమ్మాన్ బాషా, అనీఫ్ బాషా, చిన్నా, రమణారెడ్డి, శ్రీనివాసులు, బెన్నయ్య బాబ్, కోటేశ్వరరావు, చంద్రబాబు, రవిచంద్రశేఖర్ శెట్టి, రఫీ, షరీఫ్, ముఖేష్, సంక్రుద్, సాయికిరణ్, తులసీ కుమార్ యాదవ్, సుబ్రమణ్యం, పురుషోత్తం, అయ్యప్పరెడ్డి, అహ్మద్, హేమాద్రి, రాజేష్ యాదవ్, నరసింహ, రాధ, ధనుంజయులు, రామచంద్ర, మణికంఠ, మునిరత్నం. నారాయణ, జయప్రకాష్, మోహన్ ప్రసాద్, దోలాకుమార్, జనార్ధన్ బాబు, బాలకృష్ణ, సతీష్‌రెడ్డి, భాస్కర్, ముస్తాఫ్, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేష్, గోపి, మదన్ కుమార్, సుధాకర్‌రెడ్డి, సుజిత కుమార్, చెంచయ్య యాదవ్‌ను నియమించారు.

ఘనంగా పద్మావతి కళాశాల వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాల 32వ వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో టీటీడీ అదనపు ఆర్థిక ముఖ్య గణాంకాధికారి ఎస్.రవిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యే ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. ఈ రెండేళ్ల పాటు విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీటీడీ ఉప అటవీ శాఖాధికారి శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ నారాయణమ్మ, డాక్టర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించు పవన్ స్వామి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: 'సనాతన ధర్మ పరిరక్షణే నా లక్ష్యం' అని ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో సనాతన ధర్మం డిక్లరేషన్ ప్రకటించిన పవన్ స్వామి కూటమి అరాచకాలను రూపుమాపి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. వారు గురువారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో సనాతన పవన్ స్వామి ఎక్కడ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే పవన్ కల్యాణ్ నోరు మెదపక పోవడం విడ్డూరమన్నారు. కూటమి పాలనలో మహిళలు, బాలికలపై హత్యాచారాలు మితిమీరుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు తన బాధ్యత అని చెప్పిన పవన్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఒంటరిగా గెలిచి సంక్షేమ పాలనతో అశేష ప్రజాదరణ పొందిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని స్పష్టం చేశారు. కనీసం రాజకీయ పరిజ్ఞానం లేని వారు జగనన్నను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని హితవుపలికారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు అనిల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, మల్లం రవికుమార్, లోకేష్, ముని పాల్గొన్నారు.

ధర్మ మార్గాలతో జీవిత పరమావధికి మోక్షం

తిరుపతి కల్చరల్: భక్తి, కర్మ, జ్ఞాన, ధర్మ మార్గాల ద్వారా మానవుడు జీవితానికి మోక్షం లభిస్తుందని అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో సూచించారని పలువురు వక్తలు తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఇస్కాన్ రోడ్డులోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన మహోత్సవం గురువారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అక్కడి వేదికపై డాక్టర్ మౌని రచించిన కొండలరాయుని సంకీర్తనా తరంగిణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పంచ సహస్రావధాని మేడసాని మోహన్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఎస్.దక్షిణామూర్తిశర్మ మాట్లాడారు. తాళ్లపాక అన్నమయ్య శ్రీవేంకటేశ్వరస్వామిని తన కీర్తనల ద్వారా ఎలా అభివర్ణించారో వివరించారు. అన్నమయ్య సాహిత్యంలో అన్ని ప్రక్రియలను స్పృశించారని తెలిపారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, విద్యాభవన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం


ప్రభుత్వ భూమిని ఆక్రమంచుకునేందుకు గోతులు తీసిన కబ్జాదారులు

చంద్రగిరి: మండలానికి చెందిన కూటమి నేతలు యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని గురువారం ఆక్రమించేందుకు ప్రయత్నించడానికి చేసిన ప్రయత్నాన్ని రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. తొండవాడ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 32లో 10 సెంట్లకుపైగా అనాధీన భూమి ఉంది. ప్రధాన రహదారికి అనుకుని ఉండటంతో దాని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ క్రమంలో భూమికి అనుకుని ప్రభుత్వం సీసీ రోడ్డును మంజూరు చేసింది. రెండు రోజుల క్రితం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించింది. గురువారం అధికార పార్టీకి చెందిన నేత జేసీబీతో సీసీ రోడ్డు నిర్మాణం మాటున భూమిని కబ్జా చేసేందుకు పథకం రచించాడు. జేసీబీతో చదును చేస్తుండగా దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో వెళ్లి పరిశీలించారు. వీఆర్‌వో పురుషోత్తం జేసీబీతో గుంతలను పూడ్చివేశారు. ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో బోర్డును ఏర్పాటు చేస్తామని మీడియాకు తెలిపారు.

అంకురలో అరుదైన చికిత్స


మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ల బృందం

తిరుపతి తుడా: స్థానిక అంకురా ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో డాక్టర్ల బృందం బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ, వైద్యుల బృందం గురువారం మీడియాతో మాట్లాడారు. పద్మావతిపురానికి చెందిన శబరీష్(13) తరచూ ఫిట్స్‌తో బాధపడుతూ స్పృహ కోల్పోయేవాడని తెలిపారు. తల్లిదండ్రులు బాలుడిని అంకురా ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చేర్చారని పేర్కొన్నారు. వైద్యుల బృందం బాలుడికి పలు పరీక్షలు చేసి మెదడు వాపు వ్యాధిగా నిర్ధారించినట్టు తెలిపారు. ఏడు రోజుల పాటు ఆక్సిజన్ థెరఫీతో మెకానికల్ వెంటిలేషన్ ద్వారా వైద్యం అందించినట్టు వివరించారు. బాలుడు కోలుకోవడంతో గురువారం డిశ్చార్జ్ చేశామని పేర్కొన్నారు. చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ఎన్నో ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయంకాలేదని, అంకురాలో వైద్యులు తమ బిడ్డను బతికించారని బాలుడి తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అరుదైన చికిత్స చేసిన వైద్య బృందంలో డాక్టర్ రవిచంద్ర, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ దినేష్‌రెడ్డి, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ రమణ ఉన్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలో ప్రజా అవసరాల దృష్ట్యా మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. ఇందుకోసం గురుఆరం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రైల్వేస్టేషన్, జగజ్జీవన్ రామ్ పార్కు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ త్వరలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత


చంద్రగిరి: మండలంలోని ఆముదాలకోన ఎస్టీ కాలనీలో గురువారం పాము కాటు వేయడంతో రైతు అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన నాగరాజు వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పాము కాటు వేసింది. అతను అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని తిరుపతి రుయాకు తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న సిబ్బంది

పాకాల : మండలంలోని గాదంకి ఎన్‌ఏఆర్‌ఎల్‌లో గురువారం వ్యర్థాల నిర్వహణ, పరిష్కారంపై డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్రో అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. 2025 ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ఉద్దేశం పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ సమస్యలను పరిష్కరించడమేన్నారు. శాస్త్రవేత్త పి.రవిప్రసాద్, బి.మల్లికా మాధురి పలు విషయాలను వివరించారు. అనంతరం విద్యార్థులు, రీసెర్చ్ కాలర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు స్వచ్ఛ్‌భారత్‌పై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

తహసీల్దార్ చొరవతో దారి ఏర్పాటు


దారి ఏర్పాటుకు సర్వే చేయిస్తున్న తహసీల్దార్

చంద్రగిరి: మండలంలోని మొరవపల్లె గ్రామస్తులు కొన్నేళ్ల పాటు పడుతున్న దారి సమస్యను గురువారం తహసీల్దార్ శివరామసుబ్బయ్య పరిష్కరించారు. జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లేందుకు గతంలో ఉన్న రోడ్డును కొంతమంది ఆక్రమించుకున్నారు. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు దారి సౌకర్యం కల్పించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. స్పందించిన ఆయన సర్వేయర్ సురేష్‌తో కలిసి సర్వే చేయించారు. 15 అడుగుల వెడల్పుతో కిలోమీటరు మేర దారి ఏర్పాటుచేశారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

19 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. 18న అంకురార్పణ చేపట్టనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. 19న ఉదయం ధ్వజారోహనం, రాత్రి హంస వాహన సేవ, 20న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి. 21న భూతవాహనం, అధికార నంది వాహనం, 24న వ్యాఘ్ర వాహనం, గజవాహనం, 25న పురుష మృగ వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి తిరుచ్చి ఉత్సవం చేపడతారు. 28న ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, రాత్రి రావణాసుర వాహన సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

రేషన్ గోడౌన్ తనిఖీ



చంద్రగిరి: చంద్రగిరి పట్టణం విజయనగర్ కాలనీ సమీపంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను గురువారం తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న రేషన్ బియ్యం, చక్కెర, నూనె, పప్పులు, రికార్డులను పరిశీలించారు. వీటిని రేషన్ దుకాణాలకు సకాలంలో సరఫరా చేయాలని తహసీల్దార్ శివరామసుబ్బయ్యను ఆదేశించారు.

పీఎంఏవై 2.0 కింద ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద సబ్సిడీతో ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు దగ్గరలో ఉన్న వార్డు సచివాలయంలో అమెనిటీ సెక్రటరీని కలవాలని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ అందజేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విశ్రాంత హెడ్‌కానిస్టేబుళ్లకు సన్మానం

తిరుపతి క్రైమ్: జిల్లాలోని గాజులమండ్యం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, జయచంద్రుడు గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. వారిని గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీస్ అతిథి గృహంలో ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ వీరు సుమారు 35 సంవత్సరాల పాటు ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు.

ఎస్వీయూ దూరవిద్య పరీక్షలను వెంటనే నిర్వహించాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని డీడీఈ పరీక్షలను తక్షణం నిర్వహించాలని లేనిపక్షంలో పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి కే శివారెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్ర, నాగార్జున యూనివర్సిటీల తరహాలో అనుబంధ కళాశాలల్లోనే డీడీఈ పరీక్షల నిర్వహణను చేపట్టాలని కోరారు. సుమారు 32 వేల మంది విద్యార్థులు ఫీజులు చెల్లించి మూడేళ్లు గడుస్తున్నా పరీక్షలు నిర్వహించకుండా కాలయాపన చేయడం దారుణమని తెలిపారు. షెడ్యూల్ విడుదల చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటుడు శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.